# ఉపాయం

భాగ్యనగర్లో పరుగు ప్రారంభించిన మారుతీ కారు భారత్ నగర్లో ప్రవేశించింది. ప్రఖ్యాత నవలా రచయిత భరత్‌కుమార్ ఇంటిముందు ఆగింది. ఠీవిగా, కార్లోంచి కాలుబయట పెట్టిన వారితో కరచాలనం చేసి సగౌరవంగా లోపలికి తీసికెళ్ళాడు భరత్‌కుమార్.

భరత్‌కుమార్ రచనలంటే పడిచస్తుంది యువలోకం. కాలేజీ పిల్లలు కాట్లాడుకుంటారు. అందుకే అతని నవలలు హట్‌కేకుల్లా అమ్ముడౌతాయి. సినిమాలుగా వస్తున్నాయి

అంతకు ముందే అతనికి హైదరాబాదు నుండి ఫోనొచ్చింది ఆమెరికాలో ఆరొందల కోట్ల రూపాయలు అవలీలగా సంపాదించిన ఆంధ్రుడు అమరేశ్వర్‌కు హఠాత్తుగా తెలుగు సినిమా తియ్యాలనే ఆలోచన వచ్చిందనీ, ఆ సినిమాకు అరవైకోట్లు కేటాయించాలనీ ఇటీవలే మార్కెట్లో కొచ్చిన తన నవలే ఆ సినిమాకు కధనీ, ఆ నవల హక్కులు కొనేందుకు కారులో బయలుదేరాడనీ

"మీ ఇల్లు బయటి నుండి పూరిల్లులా కన్పించినా లోపల రాజభవనంలాగుంది. విస్టర్ భరత్!"

అమరేశ్వర్ అభినందనలకు భరత్‌కుమార్ ఛాతీ అరంగుళాలు పెరిగింది. ఆనందడోలిక లూగించింది.

"బయటినుండి బ్రహ్మాండంగా కనబడితే ఇన్‌కంటాక్సోళ్ళ కన్ను బడ్తుంది గదండీ!" వినయంతో ముడుచుకుపోయాడు

"వెరీనైస్, మీరసలు అమెరికాలో పుట్టాల్సిన వారు సరే ఇంతవరకూ ఎన్ని నవలలు ఏఏ పేర్లతో రాశారు? ఎంత సంపాదించారు?"

"నా పేరుతో ఆరు, నా భార్యపేరుతో ఐదు, మా పనిమనిషి పేరుతో నాల్గు.. ఏ పేరుతో రాసినా నా శైలిలోని వాడి, వేడి పారకులకు బాగా తెలును అవి చదవాలని యూనివర్శిటీ విద్యార్థులు ఎగబడుతుంటారండీ."

"ఒక్కో నవల కెంత గిట్టుబాటౌతుంది?"

"సీరియల్‌గా వేసుకున్న పత్రికవాళ్లో పాతికవేలు, బుక్‌గా పబ్లిక్ చేసిన పబ్లిషరో యభైవేలు, అ తర్వాత సినిమాకు కొనుకున్న నిర్మాతో ఆరేడు లక్షలు.. పూలల్లో పెట్టిస్తున్నరు. అన్నీ సూపర్‌హిట్టే కాని అన్ని నవలలూ ఒక ఎత్తూ. ఇప్పుడు మీరు కొనబోయే "శతకోటి పాపాలకు అనంతకోటి ఉపాయాలు" నవల ఒక ఎత్తండీ."

"దాన్ని నేను చదివాను. దాన్లో యువతరాని ఉర్రూతలూగించే సెక్స్ సన్నివేశాలు, కోటీశ్వరులు సైతం కొట్టుకుచచ్చే ఎత్తులూ, పన్నులు ఎగ్గొట్టే ఉపాయలు... చాల బాగా చూపించారు. ఇది మీకే సాధ్యమైంది మిస్టర్ భరత్ అందుకే ఆ నవలా హక్కులు కొనేందుకొచ్చాను చెప్పండి ఎంతిమ్మంటారు? మొహమాటం వద్దు, బేరం ఉండొద్దు."

"ఒకే మాట. పది లక్షలు సార్!"

"సరే.. దాంట్లో వైటెంతా, బ్లాకెంతా?"

"పదివేలు వైటు. మిగితాది బ్లాకు."

"వెరీగుడ్ ఇంత సంపాదించినా పైసా పన్నుగట్టని మీ ప్రావీణ్యతకు నా జోహార్లు"

"ఏదో మీలాంటి పెద్దల ఆశీస్సులు ఇక ముందు గూడా కట్టదల్చుకోలేద్సార్!"

"సరే . కాయితం తయారుచెయ్ " తన వెంటొచ్చినాయన్ను ఆదేశించాడు అమరేశ్వర్.

పోర్టబుల్ టైప్ రైటర్ కటటకలాడింది టైపైన కాయితం భరత్‌కుమార్ ముందుంచారు సంతకానికి, కళ్ళతో చదివి కంగారుగా అరిచాడతడు.

"ఆ...నో... మోసం...దగా...! యూ ..యూ.... ఒళ్ళంతా చెమటలుపట్టేసింది. కాళ్లు వణుకుతున్నాయి

"మీరు చెప్పిందంతా ఆడియో, విడియో కాసెట్లలో కెక్కింది. చూస్తారా?" అమరేశ్వర్ అన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

అమరేశ్వర్ అసలు పేరు అంజనికుమార్ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటులో ఉన్నతోద్యోగి

(అమృత్ కిరణ్ - 16-4-1996)

